
# సినీ బేతాళ కథలు



## – డా. కె.వివేకానందమూర్తి



*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 43 -

### - ద్విపాత్రాభినయం -

**విసుగులేని** విక్రమార్కుడు, మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడక సాగించాడు.

‘విక్రా! మార్గమధ్యంలో నీకు సేద తీరేలా మరో సోది కథ చెబుతాను – విను!‘ – అని బేతాళుడు ప్రారంభించాడు.

"ఏ.వి.నాగులు అనే నిర్మాత వున్నాడు. షాజహాన్ అనే దర్శకుడు అతనికి వతనుగా పనిచేస్తూవుంటాడు. ఏ.వి.నాగులు తక్కువ ఖర్చుతో అన్నీ లోబడ్జెట్ తెలుగు చిత్రాలు తీస్తాడు. ఏ.వి.నాగుల్ని అంతా ఏవియ్యన్ అని పిలుస్తారు. ఎందుకలా పిలుస్తారు అని అడిగితే, దర్శకుడు షాజహాన్ ‘వాడు తీసేవి లోబడ్జెట్ సినిమాలు. ఎవరికీ డబ్బులు ఏవివ్వడు. అడిగితే నా దగ్గర డబ్బుల్లేవు. ఏవియ్యన్?‘ అంటాడు. నాకేదో అప్పుడప్పుడు కాస్త పడేస్తాడు. కళామతల్లి సేవకోసం కానీ యివ్వకపోయినా పనిచేస్తాను. ఇంకో తదుపరి చిత్రం లేదనే బెంగలేదు. ఎప్పుడూ ఏదో వొక సినిమా లాగుతూనే వుంటాడు.‘ అంటాడు.

ఏవియ్యనూ, షాజహాను మళ్లీ మరో సినిమా మొదలెట్టారు.

‘ఈసారి యే కథ కాపీ కొట్టావ్?‘ అడిగాడు ఏవియ్యన్.

‘కాపీ కొట్టిన కథొకటి దొరికింది. దానికే వొరిజినల్ కలరింగిచ్చా.‘

‘హీరోగాడెవన్నెట్టుకుందాం?‘

‘ఒకడు దొరికాడులెండి‘

‘ఎవడాడు?‘

‘ఆసమ్ హీరో అప్పలకొండ‘

‘అప్పలకొండా? మరీ ఆసమ్మేటి?‘

‘బిరుదండి. నేనే తగిలించేసా. హీరోగాల్లకి మన బిరుదులు మనమే తొడిగెయ్యడం ఆనవాయితీ కదండి మరి.‘

‘సరేమరి – హీరోయిను?‘

'మన అప్పలకొండే చేసేస్తాడండి. ఇంతకు ముందు స్త్రీ పాత్రలు, భరతనాట్యాలు, కూచిపూడి బాగా చేసేవాడండి. అంచేత ద్విపాత్రాభినయం సెటప్ చేశానండి. ఆడే హీరో, ఆడే హీరోయిను - మనం పోల్చుకున్నా కథలో ఆల్లిద్దరూ పోల్చుకోలేరండి.'

'అంటే మన్ది పయోగాత్ర స్త్రితం అన్నమాట.'

'మరేనండి. కానీ మనకింకో హీరోయిన్ కావాలండి.' 'అదేనండి. మన కథలో రెండు హీరోయిన్లుంటాయండి. ఒకటి మనోడు చేస్తే, యింకోటి వేరే అమ్మాయి చేస్తుందండి.'

'యిద్దరెందుకయ్యా? కర్సు. ఒకటితో సరిపెట్టలేవా?'

'సరిపెట్టడానికి కథొప్పుకోదండి. ప్లేట్లో ఒక సింగిల్ యిడ్లీకి బదులు రెండిడ్లీలుంటే ప్లేటు నిండుగా వుంటుందండి. ఇద్దరు హీరోయిన్లుంటే తెర నిండుగా వుంటుందండి. యిక ఖర్చు అంటారా? తవరు ఏవియ్యన్‌గారు. ఖర్చుతో పనేవుంటుంది చెప్పండి.'

'కర్సే. అయితే ఓ పాలి సూద్దాం. ఆ రొండో హీరోయిన్‌ని పిలిపించు. యింతకీ తెలుగా? తెలుపా?'

'బలేవారే - అసలు సిసలు తెలుగు తెలుపు - చామనచాయండి. రేపు మీటింగు సెటప్ చేశానండి.'

'సర్లే - యింతకీ అమ్మడి పేరేటి?'

'అమీనాజనాబ్'

'అదేటీ - తెలుగన్నావ్?'

'రంగు తెలుగన్నానండి. అయినా లైట్లార్పేశాక, ఐ మీన్ థియేటర్లో లైట్లార్పేశాక మనకి హీరోయిన్ ముఖ్యం - భాషతో పనేముందండి.'

'పేరేటన్నావ్?'

'అమీనాజనాబ్ - తెలుగు దంచేస్తుందండి.'

'అదెలా?'

'బలేవారే - యిప్పుడు తెలుగు భాష మన తెలుగు దేశంలో తప్ప ప్రపంచంలో అన్ని దేశాలవారికీ బాగా వచ్చండి.'

'సత్తెం పలికావురా సాజహానూ!'

మర్నాడు రెండో హీరోయిన్‌ని పిలిపించాడు దర్శకుడు షాజహాను.

ఎంట్రీ యిచ్చిన శాల్తీని చూడగానే నిర్మాత ఏవియ్యన్ ఎగిరి వునిక్కిపడి జడుసుకున్నాడు.

'ఏంటయ్యా షాజహానూ! ముఖం కనిపించకుండా జంగందేవరలా ఆ గడ్డాలూ మీసాలూ ఏవిటయ్యా! ఇది అమీనాజనాబా? ఔరంగజేబా?' 'ఏటమ్మా నీ పేరు?' అడిగాడు ఏవియ్యన్.

గడ్డిమేట్లోంచి గుసగుసలు వినిపించినట్టుగా గడ్డం మీసాల్లోంచి 'అమీనాజనాబ్' అనే సౌండ్ విడుదలయ్యింది.

ఏవియ్యన్ మళ్లీ వులిక్కిపడ్డాడు.

'కంగారు పడకండి సార్! ఈయన హీరోయిన్ తండ్రి. మీరన్నట్టు ఈయనపేరు ఔరంగజేబే.- గొప్ప దర్శకుడు. కానీ ప్రస్తుతం పిక్చర్లేం లేవు. దర్శకుడిగా గుర్తింపుకోసం గడ్డం మీసాలు పెంచుకుంటున్నాడు. ఇప్పుడు మన హీరోయిన్ పాత్రకు తన కూతురు 'అమీనాజనాబ్'ని తీసుకొచ్చానని మీకు చెప్పడానికి గడ్డం అడ్డంగా వున్నా ట్రై చేస్తున్నాడు.'

'అయితే హీరోయిన్ని పిలు.'

'తప్పకుండా. అని షాజహాన్ 'అమీనా! అమీనా! యిలా రామ్మా! నిర్మాతగారు నిన్ను చూస్తార్ట' అంటూ పిలిచాడు.

అమీనా వచ్చి నిర్మాత ఏవియ్యాన్ ఎదురుగా నిలబడింది. ఆమె అందం చూస్తూ కళ్లార్పకుండా నోరు తెరుచుకుని వుండిపోయాడు ఏవియ్యాన్.

'ఏటలా సూత్తన్నారు - యేసం ఫిక్సేనా?' - అడిగింది అమీన.

ఏవియ్యాన్ తేరుకుని అన్నాడు - 'సూపర్‌గా వున్నావ్ - తెలుగా దంచేత్తనావ్. యేసవేటి - అన్నీ ఫిక్సే. ఏదో అనుకున్నాను. మా షాజహానుగాడు మాంచి సెలక్సనే సేసాడు. ఆలోకే."

అమీనా అంది - 'యిదుగో, ముందే సెప్తాన్నా. నేను యేసవే యేత్తా. యేసం తప్ప యేటీ సెయ్యను. నాను పరవ పత్రివతని. ఎదవ్వేసాలేస్తే మాడు పగులుద్ది.'

'అబ్బబ్బే! మా నిర్మాతగారికి అలాంటి తీరికలు, కోరికలు లేవమ్మా' అని హామీ యిచ్చాడు దర్శకుడు షాజహాన్.

'హీరో మంచోడేనా!' అడిగింది అమీనా.

'బలేదానివే - మన హీరో ఆసమ్ అప్పలకొండ. యెంతో క్రమశిక్షణగలాడు. మన చిత్రంలో ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఆడికసలు తీరికుండదు. అమీనా! నువ్వలాంటి బెంగలేం పెట్టుకోకు!' - అని హామీ యిచ్చాడు. షాజహాన్.

ఏవియ్యాన్ తదుపరి తెలుగు చిత్రం షూటింగ్ మొదలయ్యింది.

లంచ్ బ్రేక్‌లో హీరోయిన్ అమీనా మేకప్ రూమ్‌లో రిలాక్సవుతోంది. అప్పుడు ఆసమ్ హీరో అప్పలకొండ కూడా అదే మేకప్ రూమ్‌లోకి వచ్చాడు. వచ్చి అక్కడ అమీనాని చూసి 'సారీ. మీరిక్కడున్నారనుకోలేదు. నేను పక్కరూమ్‌లోకి వెళ్తా' అని వెనుతిరగబోయాడు.

పతివ్రత అమీనా 'ఇట్సోకే అప్పల్. కమాన్. దా. కూకో. కూకుని కుస్సేపు కవుర్లు సెప్పు' అని పిలిచింది.

అప్పలకొండ బెరుకు బెరుగ్గా అమీనా దగ్గరకొచ్చాడు.

'నా జాకిట్టు వుక్కు తీసెయ్' అంది అమీనా.

అప్పలకొండ భయంభయంగా జాకెట్ హుక్ తీశాడు.

'ఇప్పుడ్ నా బ్రా తీసెయ్' అంది.

వణికే చేతుల్తో బ్రా తీసేశాడు.

'ఇప్పుడేమో నా సీర యిప్పెయ్యి మరి' అంది.

బెదురుతూ యిష్టంగా చీర విప్పేశాడు.

- 'అదీ విక్రమార్కా! విషయం. పతివ్రతా హీరోయిన్ అమీనా ఆసమ్ హీరో అప్పలకొండతో యెందుకలా ప్రవర్తించింది? ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యిచెక్కలై వెర్రిముక్కలైపోతుంది' అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు - 'ఓ బేతాళా! నువ్వు కథ కంటిన్యూ చెయ్యకుండా ఆపేసి, ప్రశ్నతో ఫినిషింగిచ్చావు. నువ్వు ఆపిన కథ నేను కంటిన్యూ చేస్తే నీ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. విను.

అమీనా తన వస్త్రాలన్నీ అప్పలకొండతో విప్పించేశాక అతనితో యిలా అంది "ఒరే ఆసమ్ అప్పలకొండా! నువ్వీ సినిమాలో హీరోగానే కాకుండా యింకో వీరోయిన్ యేసం కూడా సేత్తన్నావని తెలుసు. అలాగని యిలా నా బట్టలేసుకు తిరిగావంటే యిప్పించైడవేకాదు. నీ సేతులూ కాళ్లూ యిరగదీస్తా. ఆ యెదవ నిర్మాత ఏవియ్యాన్‌గాడు కాస్ట్యూవులు కూడా కొనకపోతే నా డ్రస్సులే దొరికాయిరా నీకు?' అని వార్నింగిచ్చింది.

మత్తః పరతరం నాన్యత్
కించిదస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం
సూత్రే మణి గణా ఇవ॥

అన్నిటినీ పుట్టించు రెండు ప్రకృతులకు కారణమైనవాడను, అచేతన వస్తువులకు, శేషియగు జీవునకు శేషిని గనుక నాకంటె గొప్ప పదార్థమేదియును లేదు. - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీ కృష్ణభగవానుడు" అని ముగించగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments